### విలేఖరులు కావలెను

ప్రజాపక్షమే లక్ష్యంగా సీనియర్ జర్నలిస్టు మేడే శాంతికుమార్ సారధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వెలువడుతున్న ధర్మఘంట తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో అన్ని జిల్లాలకు జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, మండల విలేఖరులు కావలెను. ఆసక్తి గల వారు తమ బయోడేటాను ఈక్రింది చిరునామాకు పంపించగలరు..

స్ఫూర్తి పబ్లికేషన్స్, నెం: 7-8-94/2, శ్రీనగర్ కాలనీ,
పానగల్ రోడ్డు, నల్లగొండ-508001. ఫోన్ నెం: 9885826108.
E-mail: shanthimama@gmail.com



ప్రజల కోసం - ప్రకృతి కోసం - సామాన్యుని గొంతుగా - సామాజిక సమరంగా స్ఫూర్తి పబ్లికేషన్స్ వారి

# ధర్మఘంట

TELTEL/2012/47103

తెలుగు జాతీయ దిన పత్రిక

సంపుటి : 12 సంచిక :69 నల్గొండ గురువారం 29-05-2025 ఎడిటర్ : మేడే శాంతికుమార్ పేజీలు : 4 వెల : రూ.1/-


## స్వామి ఆశీస్సులతోనే నేను ఈస్థాయిలో ఉన్నా!



ఖమ్మం:ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం యడవల్లి గ్రామంలో శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి టెంపుల్ పున:ప్రతిష్ట మహోత్సవం అభివృద్ధి పనులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భూమి పూజ నిర్వహించారు.ఆలయ అభివృద్ధి పనులకు రూ. 4 కోట్ల 74 లక్షల 50 వేల రూపాయలను కేటాయించారు. పున:ప్రతిష్ట కార్యక్రమం అనంతరం డిప్యూటీ సీఎం భట్టి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉందన్నారు. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా అని, స్వామి వారి ఆశీస్సులతోనే తాను ఈస్థాయిలో ఉన్నానని చెప్పారు.'దశాబ్దాలుగా లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆరాధ్యదైవంగా ఉంది. ప్రతి ఎన్నికల సమయంలో ప్రచారం ఇక్కడ నుంచే మొదలు పెడతా. రూ. 4 కోట్ల 74 లక్షల రూపాయలు దేవాలయ అభివృద్ధి కి కేటాయించాము. మీరందరూ గెలిపిస్తేనే నేను ఉప ముఖ్యమంత్రిని అయ్యాను. రాష్ట్ర ప్రజలందరూ చల్లగా ఉండాలని ప్రజా ప్రభుత్వం మంచి పాలన అందిస్తుంది. సమాజంలో ఉన్న అన్ని వర్గాల ప్రజల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ పోతుంది. రాష్ట్రంలో ఉన్న మహిళలకు వడ్డీ లేని రుణం కింద 20 వేల కోట్ల రూపాయలు ఇస్తుంది. 22 వేల కోట్ల రూపాయలు రెండు లక్షల లోపు రైతులకు రుణమాఫీ చేశాం. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమి లేని వారికి రూ.12 వేలు ఇస్తున్నాం' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.'ప్రతి ఎన్నికల కార్యక్రమం ఇక్కడి నుంచే మొదలు పెట్టా. శ్రీయోగనంద లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులతో నేను ఈస్థాలో ఉన్నా. లక్ష్మీ నరసింహ స్వామి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు ఉండాలి. ప్రజా సంక్షేమం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం పని చేస్తుంది. పేద ప్రజలకు గ్యాస్, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్ లాంటి పథకాలు ఈ ప్రభుత్వం అందజేస్తుంది. రైతు భరోసా, రుణమాఫీ, ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం అందజేస్తుంది. పేద ప్రజలకు ఇందిరా గిరి ఆవాస్ యోజన పథకం కూడా ఉంది' అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు.

## మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ నివేదిక బూటకమని తేలిపోయింది

హైదరాబాద్ : మేడిగడ్డ బ్యారేజీపై ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని ఇప్పటిదాకా బీఆర్ఎస్ చెబుతున్న మాటే అక్షరాలా నిజమని తేలిపోయింది అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్డీఎస్ఏ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టీ సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు.క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టీ పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే. నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ గంటల వ్యవధిలో ఇచ్చిన ప్రాథమిక నివేదికను మొదలుకుని, ఏడాదిన్నర దాకా సాగదీసి ఇటీవల ఇచ్చిన తుది నివేదిక వరకూ రెండింటిలోనూ అడుగడుగునా వ్యత్యాసాలు, పొంతనలేని అంశాలుండటం రిపోర్టు డొల్లతనాన్ని బయటపెట్టింది. ఇలాంటి పనికిరాని రిపోర్టును పట్టుకుని ఎన్డీఎస్ఏ నివేదికనే తమకు ప్రామాణికమని ముఖ్యమంత్రి రేవంత్, రాష్ట్ర ప్రభుత్వం చెప్పడం వారి అసమర్థతకు, చేతకానితనానికి, దివాలాకోరు విధానాలకు నిదర్శనం అని కేటీఆర్ పేర్కొన్నారు.కేసీఆర్ పేరొస్తుందనే రాజకీయ కక్షతో ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అయిన కాళేశ్వరంను పక్కనపెట్టి సీఎం రేవంత్ క్షమించరాని పాపం చేశారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నిర్వాకం వల్ల ఏడాదిన్నరగా రాష్ట్రంలోని లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండగొట్టి, 500 మందికి పైగా అన్నదాతలు ఆత్మహత్యలకు కారణమయ్యారు. పోలవరం ప్రాజెక్టులో డయాఫ్రం వాల్ కొట్టుకుపోయినా శరవేగంగా పునరుద్ధరించిన సంగతి మరిచిపోయి, మేడిగడ్డ విషయంలో మాత్రం 18 నెలలుగా మొత్తం ప్రాజెక్టునే కోల్డ్ స్టోరేజీలోకి నెట్టడం అత్యంత దుర్మార్గం అని కేటీఆర్ మండిపడ్డారు.నాడు అసెంబ్లీ ఎన్నికల వేళ బీఆర్ఎస్‌పై



బురదజల్లేందుకు కుట్రలు చేసిన కాంగ్రెస్ - బీజేపీ, ఇటీవల బీఆర్ఎస్ రజతోత్సవ సభను దెబ్బతీయాలన్న కుతంత్రాలతోనే తుది నివేదిక పేరిట నయా డ్రామాకు తెరతీశారు. ప్రాజెక్టు ప్రణాళికల నుంచి నిర్మాణ నాణ్యత వరకూ అడుగడుగునా ఎక్కడా రాజీ పడకుండా కట్టిన ప్రాజెక్టుపై బురదజల్లడం మాని, ఇకనైనా ఎల్ అండ్ టీ అభ్యంతరాలకు ప్రభుత్వం, ఎన్డీఎస్ఏ సమాధానం చెప్పాలి. ఎన్డీఎస్ఏ వాదనలన్నీ తప్పుల తడక అని తేలిపోయిన నేపథ్యంలో.. దీన్ని కుంటిసాకుగా చూపి దాటవేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర రైతులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలి. లేకపోతే అన్నదాతల ఆగ్రహానికి ముఖ్యమంత్రితోపాటు కాంగ్రెస్ %-% బీజేపీల కుట్ర రాజకీయాలకు తెలంగాణ రైతులు తగిన గుణపాఠం చెప్పడం ఖాయం అని కేటీఆర్ అన్నారు. జై కిసాన్.. జై కాళేశ్వరం.. జై తెలంగాణ అని కేటీఆర్ నినదించారు.

## దేశంలో కరోనా కలకలం.. 1000 దాటిన యాక్టివ్ కేసులు..



న్యూఢిల్లీ,కరోనా వైరస్ కేసులు దేశంలో మరోసారి పెరగడం మొదలుపెట్టాయి. ప్రతిరోజూ కొత్త కోవిడ్ కేసులు వెలుగులోకి వస్తున్నాయి. బుధవారం ఉదయం నాటికి భారతదేశంలో యాక్టివ్ కేసుల సంఖ్య 1047కి చేరుకుంది. ముఖ్యంగా మహారాష్ట్రలో 66 కొత్త కేసులు, ఉత్తరప్రదేశ్‌లో 10 కొత్త కేసులు నమోదయ్యాయి. కోవిడ్-19 కారణంగా మరణించిన వారి సంఖ్య కూడా 11కి చేరింది. దేశవ్యాప్తంగా కోవిడ్‌ను ఎదుర్కోవడానికి మళ్ళీ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. చాలా రాష్ట్రాలు ఆసుపత్రులకు కొత్త మార్గదర్శకాలను జారీ చేశాయి.

### మహారాష్ట్రలో తీవ్రమవుతున్న పరిస్థితి

ఆరోగ్య మంత్రిత్వ శాఖ మే 26 వరకు డేటాను అప్‌డేట్ చేసింది. ఆ సమయంలో దేశంలో 1010 యాక్టివ్ కేసులు ఉన్నాయని తెలిపింది. కానీ ఇప్పుడు ఈ సంఖ్య ఇంకాస్త పెరిగింది. మహారాష్ట్రలో 66 కొత్త కేసులు నమోదయ్యాయి. అందులో ముంబై మహానగరంలోనే 31 కేసులు ఉన్నాయి. మహారాష్ట్రలో మొత్తం యాక్టివ్ కేసుల సంఖ్య 325కి చేరింది. ముంబైలో పెరుగుతున్న కరోనా కేసుల దృష్ట్యా, అధికారులు సన్నాహాలు ప్రారంభించారు. జేజే ఆసుపత్రిలో 15 పడకల ఐసోలేషన్ వార్డును ఏర్పాటు చేశారు.

### ఉత్తరప్రదేశ్‌లోనూ పెరుగుతున్న కరోనా కేసులు

ఉత్తరప్రదేశ్‌లో కూడా కరోనా వైరస్ కేసులు పెరుగుతున్నాయి. మే 26 నాటికి ఇక్కడ 15 యాక్టివ్ కేసులు ఉండగా.. ఇప్పుడు అవి మరో 10 పెరిగాయి. ఘజియాబాద్‌లో కూడా కరోనా కేసులు నిరంతరం పెరుగుతున్నాయి. ఘజియాబాద్‌లో కరోనా రోగుల సంఖ్య 14కి చేరుకుంది. వీరిలో 13 మంది రోగులు హోమ్ ఐసోలేషన్‌లో ఉండగా, ఒక రోగి ఆసుపత్రిలో చేరారు. ఘజియాబాద్‌లో 4 నెలల చిన్నారికి కూడా కరోనా పాజిటివ్ అని తేలింది. రాష్ట్రంలోని ఆసుపత్రులను కరోనా విషయంలో అప్రమత్తం చేశారు.

## కాళేశ్వరం విచారణ.. కెసిఆర్‌తో మరోసారి హరీశ రావు భేటీ

హైదరాబాద్,మాజీ ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ తో మరోసారి హరీశ్ రావు భేటీ అయ్యారు. బుధవారం ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో కెసిఆర్‌తో హరీశ్‌రావు సమావేశమయ్యారు. కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో మూడోసారి హరీశ్‌రావు కెసిఆర్ తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ నోటీసులు, విచారణ సంబంధిత అంశాలపై ఇద్దరు చర్చించినట్లు తెలుస్తోంది. కాగా, కాళేశ్వరం కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరుకానున్నట్లు సమాచారం. జూన్ 5న పీసీ ఘోష్ కమిషన్ ముందు కెసిఆర్ విచారణను ఎదుర్కొనున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కెసిఆర్, హరీశ్ రావులు సమావేశమవుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ప్రస్తుతం విచారణ చేస్తోంది. ఈ క్రమంలో కెసిఆర్, హరీశ్ రావు, బిజెపి ఎంపి ఈటల రాజెందర్ కు కాళేశ్వరం కమిషన్ నోటీసులు



ఇచ్చిన విషయం తెలిసిందే. జూన్ 5న కెసిఆర్, 6న హరీశ్‌రావు, 9న ఈటెల రాజేందర్ విచారణకు హాజరుకావాల్సిందిగా కమిషన్ నోటీసులు ఇచ్చింది.

## విద్యార్థులే టాయిలెట్స్ కడగాలి అంట.. కాంగ్రెస్ పాలనలో గురుకులాల పరిస్థితి ఇది

హైదరాబాద్ : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో ఉన్న పరిస్థితిపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. స్వీపింగ్, శానిటేషన్ కోసం ఒక్కో గురుకుల పాఠశాలకు ప్రతి నెల బీఆర్ఎస్ ప్రభుత్వం రూ . 40,000 కేటాయిస్తే నలుగురు తాత్కాలిక ఉద్యోగులు పనిచేసేవారు అని కవిత గుర్తు చేశారు. వీరు టాయిలెట్లు, తరగతి గదులు శుభ్రం చేసేవారు. గత సంవత్సరం ఆగస్టు నెల నుండి ఈ పద్ధతి కాంగ్రెస్ ప్రభుత్వం తొలగించినందున పిల్లలే టాయిలెట్లు, గదులు మాత్రమే కాకుండా పాఠశాల హాస్టల్ ఆవరణలోని బయటి పనులు అన్ని కూడా విద్యార్థులే రెగ్యులర్‌గా చేసుకోవాలని చెప్పారని కవిత పేర్కొన్నారు.కామారెడ్డి జిల్లా భిక్కనూరు గురుకుల పాఠశాలలోని వాచ్‌మెన్ వాటర్ ట్యాంక్ క్లీన్ చేస్తూ ప్రమాదవశాత్తు మరణించగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. రాష్ట్రంలోని 240 గురుకుల విద్యాసంస్థలలో అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించి వారు చేసే వార్డెన్ పనులను పిల్లలతో చేయించాలని చెప్తున్నారు. ఇప్పటివరకు వార్డెన్లే అన్ని రకాల నిర్వహణలు చూసుకున్నా పిల్లలు కమిటీగా ఏర్పడి క్వాలిటీ చెక్ చేసుకునేవారు. కానీ ఇకపై పిల్లలే వంటశాల నిర్వహణ మరియు మెస్ పనులు కూడా చేయవలసి వస్తుందన్నారు. ( శ్రమను గౌరవించడం) నేర్పడం వేరు, విద్యార్థులతో వెట్టిచాకిరి చేయించడం వేరు. అసలు మొత్తంగా శానిటేషన్ వర్కర్స్‌ను తొలగించి ఆ పనులు పిల్లలతో రెగ్యులర్‌గా చేయించడం నేరమని కవిత పేర్కొన్నారు. ఇక్కడ ఆడియోలో వర్షిని గారు చెప్పిన దాంట్లోనే సమాధానం ఉంది. బోర్డు తుడవడం టాయిలెట్ కడగడం ఒకటి కాదు. మేడం గారి పిల్లలు చదువుకునే చోట అందరూ వాడే టాయిలెట్లను వీరు క్లీన్ చేయగలరా. అది కూడా రెగ్యులర్‌గా. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌లో చదివే పిల్లలు ఏమైనా పోష్ బ్యాక్ గ్రౌండ్ నుండి వచ్చారా? వెళ్లి కూర్చోగానే టేబుల్ పైకి ఫుడ్ రాదు అనడం.. ఎందుకు ఇలాంటి పనులు చేయరు చేయాల్సిందే అని ఒక ఐఏఎస్ అనడం దుర్మార్గం. ఈ వివక్షల నుండి తప్పించడానికే కదా ఈ పిల్లలకు సాంఘిక సంక్షేమ హాస్టల్స్ ఏర్పాటు చేయించి చదివించేది. ఇది డిగ్నిటీ ఆఫ్ లేబర్ నేర్పడం కాదు. కుల వివక్ష,



శ్రమ దోపిడీ మాత్రమే అని కవిత అన్నారు.దీంతో పాటు 240 మంది అసిస్టెంట్ కేర్ టేకర్‌లను తొలగించడం కూడా. గతంలో లాగానే పిల్లలు క్వాలిటీ మాత్రమే తనిఖీ చేసుకునే ఏర్పాటు ఉండాలి. అంతే కానీ పిల్లలతో పూర్తిస్థాయి వార్డెన్, శానిటేషన్ వర్కర్స్ చేయించే పని చేయించడం కరెక్ట్ కాదు. నలుగురు శానిటేషన్ వర్కర్స్ ఒక వార్డెన్ మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ గురుకులాలలో కలిపి 1200 మంది ఉద్యోగులను తొలగించడం అన్యాయం. ఒకవైపు ఉద్యోగాలు కల్పిస్తామని కల్లబొల్లి కబుర్లు చెప్పడం మరోవైపు అత్యవసరమైన చోట వారిని తొలగించి ఆ పని భారం విద్యార్థుల మీద ఉంచడం తప్పు అని కవిత పేర్కొన్నారు.పోష్ పిల్లలు కాకపోయినా అందరూ పిల్లలు సమాజం దృష్టిలో, ప్రభుత్వం దృష్టిలో సమానమే అన్న సంకేతాలను పంపాల్సిన గురుకుల పాఠశాలలు వివక్ష కేంద్రాలుగా మారకూడదు. ఎస్సీ వర్గాల పిల్లలు ప్రధానంగా చదివే గురుకుల పాఠశాలలో ఈ నిర్ణయం మానవతావాదులు ముక్తకంఠంతో ఖండించవలసింది. కాంగ్రెస్ ప్రభుత్వ పేదల వ్యతిరేక ఆలోచన విధానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను, తక్షణమే ఆ అధికారిని తప్పించాలి, నెలకు మెయింటెనెన్సు డబ్బులు పాఠశాలలకు ఇవ్వాలి. పిల్లలతో పనిచేయించటం ఆపివేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు.

## దేశంలోనే తొలి హెలికాప్టర్ తయారీ కేంద్రం.. ఎక్కడంటే..!



న్యూఢిల్లీ, దేశంలోనే తొలి ప్రైవేట్ హెలికాప్టర్ల తయారీ కేంద్రం కర్ణాటక రాష్ట్రంలో ఏర్పాటు కానుంది. యూరప్‌కు చెందిన వైమానిక ఉత్పత్తుల సంస్థ ఎయిర్‌బస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లు సంయుక్తంగా కర్ణాటక లోని కోలారు జిల్లా లో హెచ్ 125 తేలికపాటి హెలికాప్టర్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నాయి. తొలుత 10 యూనిట్లు, ఆ తర్వాత 20 ఏళ్లలో క్రమంగా 500 యూనిట్ల వరకు హెలికాప్టర్లను తయారు చేసేలా ఈ కేంద్రాన్ని విస్తరించనున్నారు. కోలారులోని వేమగల్ పారిశ్రామిక వాడలో ఏర్పాటయ్యే ఈ కేంద్రంలో హెలికాప్టర్ల తయారీకి స్వదేశీ సాంకేతికతను ఉపయోగించనున్నారు. ఇలా తయారు చేసిన హెలికాప్టర్లను దేశీయ అవసరాలకు, భారతీయ సైన్యానికి, ఇతర దేశాలకు సరఫరా చేయనున్నారు. ఫ్రాన్స్, అమెరికా, బ్రెజిల్ తర్వాత హెచ్ 125 హెలికాప్టర్ల తయారీ యూనిట్‌ను స్థాపిస్తున్న నాలుగో దేశంగా భారత్ నిలువనుంది.హెలికాప్టర్ల తయారీ, నిర్వహణ, మరమ్మతు తదితర కార్యకలాపాల కోసం 7.40 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సేకరించనున్నారు. ఈ నేపథ్యంలో ఇతర ఒప్పంద కార్యక్రమాలను వేగంగా పూర్తి చేసేందుకు కర్ణాటక ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ క్లియరెన్స్ విండోను ఏర్పాటు చేసినట్లు భారీ పరిశ్రమల శాఖ ప్రకటించింది.

## నన్ను కాల్చి చంపి.. గణబంధన్‌లో పాతిపెట్టండి

ఢాకా, గతేడాది బంగ్లాలో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే. ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారింది. వేలాది మంది నిరసనకారులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విద్యార్థుల నిరసనతో అప్రమత్తమైన ఆర్మీ.. ప్రధాని పదవికి రాజీనామా చేయాలని షేక్ హసీనా కు సూచించింది.

ఆ సమయంలో హసీనా తనను కాల్చి చంపేయండి అంటూ ఆర్మీతో అన్నట్లు తాజాగా వెల్లడైంది. 'నన్ను కాల్చి చంపేయండి.. ఇక్కడే ఈ గణబంధన్‌లోనే పాతి పెట్టండి' అంటూ ఆర్మీతో అన్నట్లు అంతర్జాతీయ నేరాల ట్రిబ్యునల్‌లో జరిగిన విచారణ సందర్భంగా చీఫ్ ప్రాసిక్యూటర్ మొహమ్మద్ తాజుల్ ఇస్లాం ఈ విషయాన్ని వెల్లడించారు.గతేడాది బంగ్లాలో రాజకీయ అస్థిరత నెలకొన్న విషయం తెలిసిందే. ఉద్యోగాల్లో రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మొదలైన విద్యార్థుల ఉద్యమం హింసాత్మకంగా మారింది. వేలాది మంది నిరసనకారులు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ప్రజా ఉద్యమానికి జడసి ప్రధాని షేక్ హసీనా తన పదవికి రాజీనామా చేసి దేశం వీడారు. ప్రస్తుతం ఆమె భారత్‌లో ఆశ్రయం పొందుతున్నారు. దీంతో రంగంలోకి



దిగిన ఆర్మీ దేశాన్ని తమ చేతుల్లోకి తీసుకుం ది. ఆ తర్వాత బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ చీఫ్ అడ్వయిజర్‌గా నోబెల్ బ హుమతి గ్రహీత మహమ్మద్ యూనస్ బాధ్యతలు చేపట్టారు. గతేడాది ఆగస్టు 8న ఆయన తాత్కాలిక ప్రభుత్వాధినేతగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే.

## నేతల సవాళ్లు, ప్రతిసవాళ్లు.. ఎమ్మెల్యే హరీష్ బాబును అడ్డుకున్న పోలీసులు!



సిర్పూర్:సిర్పూర్‌లో నేతల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు కొనసాగుతున్నాయి. తుమ్మడి హట్టి ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు మంగళవారం సవాల్ విసిరారు.ఎమ్మెల్యే సవాల్‌ను కోనప్ప స్వీకరించారు. ఈరోజు ఉదయం 11 గంటలకు తుమ్మడి హట్టి వద్ద బహిరంగ చర్చకు ఇద్దరు నేతలు, వారి అనుచరులు సిద్ధమయ్యారు. అయితే కాగజ్ నగర్‌లో ఎమ్మెల్యే హరీష్ బాబును తుమ్మడి హట్టి వద్దకు వెళ్లకుండా ఆయన ఇంటి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. మరోవైపు కోనప్ప, ఆయన అనుచరులు కూడా అడ్డుకున్నారు.నీళ్లు సిద్దిపేటకు తరలిపోతుంటే కోనేరు కోనప్ప చూస్తూ ఊరుకున్నారని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ బాబు ఆరోపణలు చేశారు. కోనప్ప వల్లే సిర్పూర్‌కు అన్యాయం జరిగిందన్నారు. తుమ్మిడి హట్టి నుంచి ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించినా కోనప్ప మాట్లాడలేదన్నారు. తుమ్మిడి హెట్టి వద్ద ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ కట్టవద్దని గతంలో ఎమ్మెల్యే హరీష్ కుటుంబ సభ్యులు (తల్లి) ధర్నాలు చేశారని కోనప్ప ఆరోపించారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం జరిగింది. దీనిపై బహిరంగ చర్చకు వెళ్లేందుకు మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్యే సిద్ధమయ్యారు. బహిరంగ చర్చకు వెళ్లకుండా ఇద్దరినీ పోలీసులు అడ్డుకున్నారు. ప్రస్తుతం కోనప్ప ఇంటి వద్ద పోలీసులు మోహరించారు.

## సంపాదకీయం

గురువారం 29-05-2025

# ఉత్పత్తులు దండిగా... ఉపాధి మెండుగా...

స్వతంత్ర పోరాటంలో జాతిని ఏకతాటిపై నడిపించిన ఖాదీ-గ్రామీణ భారత అభివృద్ధికి వెన్నెముకగా నిలిచింది. దేశంలో స్వావలంబన స్ఫూర్తిని పెంపొందించింది. పల్లె ప్రజల జీవితాల్లో వెలుగులు నింపడంలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రంగానిది కీలక పాత్ర. ఖాదీ, చేనేత ఉత్పత్తులు, హస్తకళలను మరింతగా ప్రోత్సహించే లక్ష్యంతో 'యూనిటీ మాల్స్' సిద్ధమవుతున్నాయి. దేశాభివృద్ధిలో ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రంగం తనవంతు పాత్ర పోషిస్తోంది. గ్రామీణ పరిశ్రమల రంగంలో భాగంగా కార్పెంటరీ, బొమ్మలు, వ్యవసాయ ఉత్పత్తుల నుంచి వస్తువులు, కుండలు, సుద్దముక్కలు, అగ్గిపెట్టెల తయారీ, తేనెటీగల పెంపకం, జీడిపప్పు, కాగితం, చెప్పులు, తోలు ఉత్పత్తులు, కొవ్వొత్తుల తయారీ తదితరాలెన్నో ఉన్నాయి. ఇవి గ్రామీణ భారతంలో ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాయి. మరోవైపు, ఖాదీ వస్త్ర ఉత్పత్తి జాతి వారసత్వ సంపద. పట్టు చీరల తయారీలో మన పోచంపల్లి, పటోలా, వెంకటగిరి, మదనపల్లె, ధర్మవరం, ఉప్పాడ, గద్వాల్ చీరలకు ఎంతో పేరుంది. పొందూరు ఖద్దరు బట్టలకూ అంతే ప్రాధాన్యముంది. బెనారస్, కంజీవరం, బంధని, చందేరి, కోటా తదితర చీరలు కళాకారుల అత్యున్నత నైపుణ్యాలకు నిదర్శనంగా నిలిచేవే. ఇవన్నీ దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతున్నాయి.

వాణిజ్యంలో వృద్ధి

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి, విక్రయాలు, ఉపాధి కల్పనలో కొత్త రికార్డు నెలకొల్పింది. గత పదకొండేళ్లలో అమ్మకాల్లో 447 శాతం, ఉత్పత్తిలో 347 శాతం, ఉపాధి కల్పనలో 49.23 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమల రంగంలో పదకొండేళ్ల కిందట సుమారు రూ.26 వేల కోట్ల వస్తూత్పత్తి జరగ్గా, అది 2024-25 ఆర్థిక సంవత్సరానికి రికార్డు స్థాయిలో రూ.1.16 లక్షల కోట్లకు చేరింది. విక్రయాల్లో అప్పట్లో రూ.31వేల కోట్లు సాధిస్తే, ఇప్పుడది రూ.1.70లక్షల కోట్లకు చేరింది. ఖాదీ దుస్తుల ఉత్పత్తిలోనూ అపూర్వ వృద్ధి నమోదైంది. 2013-14 ఆర్థిక సంవత్సరంలో రూ.811 కోట్ల ఉత్పత్తి జరిగితే, 2024-25లో అది మూడు వేల కోట్ల రూపాయలు దాటింది. ఈ రంగం ఇప్పటిదాకా కనబరిచిన అత్యుత్తమ పనితీరిది. దుస్తుల విక్రయాల్లో అప్పట్లో రూ.వెయ్యి కోట్ల ఆదాయం రాగా, నేడు రూ.7 వేల కోట్లకుపైగానే వస్తోంది. ఈ రంగం గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. గత పదేళ్లలో రికార్డు స్థాయిలో పేదలకు పని కల్పించింది. దిల్లీలోని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల భవన్ మునుపెన్నడూ లేని రీతిలో వాణిజ్య వృద్ధిని నమోదు చేసింది. ఆ భవన్ వ్యాపారం పదేళ్ల కిందట సుమారు రూ.51 కోట్లు ఉండగా, ఇప్పుడది దాదాపు రెండు రెట్లు పెరిగి రూ.110 కోట్లు దాటింది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమ మహిళా సాధికారతకూ పట్టుగొమ్మగా నిలుస్తోంది. ఈ రంగంలో ఉపాధి పొందుతున్న వారిలో 80 శాతం మంది మహిళలే. ఇంటి దగ్గరే పని కల్పించడం, రుణాలు అందిస్తుండటంతో ఎక్కువమంది ఆసక్తి చూపుతున్నారు. పనిలో అత్యున్నత నైపుణ్యం ప్రదర్శిస్తుండటంతో ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయిదు లక్షల మంది ఖాదీ కళాకారుల్లో 4.27 లక్షల మంది మహిళలే ఉండటం గమనార్హం. ఇది వారి కుటుంబాల్లో వెలుగులు నింపడానికి ఎంతగానో దోహదపడుతోంది. ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం ప్రారంభించినప్పటి నుంచి మొత్తంగా పదివేలకు పైగానే యూనిట్లు నెలకొల్పారు. వీటికి బ్యాంకుల నుంచి రుణాల తీసుకునే వెసులుబాటు కల్పించారు. గత ఏడాది రూ.73 వేల కోట్లకుపైగా రుణాలు మంజూరు చేశారు. వీటి ద్వారా ఇప్పటి వరకు 90లక్షల మందికిపైగా ఉపాధి పొందారు.

గ్రామాలకు ఆసరాగా...

గ్రామీణ ప్రాంతాల్లో అత్యధిక మందికి ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో బడ్జెట్‌లో ఈ రంగానికి ఇతోధికంగా నిధులు కేటాయిస్తున్నారు. 2021-22తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు రెండు రెట్లకుపైగా పెరిగాయి. రూ.60 కోట్లకు పెంచారు. ఇప్పటిదాకా 2.87లక్షలకుపైగా యంత్రాలు, పరికరాలను పంపిణీ చేశారు. గ్రామీణ, చేతివృత్తుదారుల ఉత్పత్తులకు ప్రత్యేక వేదిక కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో 'యూనిటీ మాల్'ను నిర్మిస్తోంది. అయిదెకరాల విస్తీర్ణంలో రూ.172 కోట్లతో జీ౦4 అంతస్తులతో నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో రెండంతస్తుల్లో 62 దుకాణాలు నిర్మించగా, 26 ఏపీకి, 36 మిగతా రాష్ట్రాలకు కేటాయించనున్నారు. రాజస్థాన్, ఒడిశా, గుజరాత్, తెలంగాణ, కేరళ ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన కళాకృతులను ఈ యూనిటీ మాల్‌లో ఉంచుతారు. ఆయా ప్రాంతాలకు చెందిన జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) కలిగిన ఉత్పత్తులకు ప్రాధాన్యం కల్పిస్తారు. సాంస్కృతిక భిన్నత్వాన్ని చాటి చెప్పేలా దీన్ని నిర్మిస్తున్నారు. మిగతా రాష్ట్రాల్లోనూ ఈ తరహా నిర్మాణాల దిశగా కసరత్తు జరుగుతోంది. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలకు వ్యవస్థాగత సాయం ఎంత పెరిగితే అంతగా పల్లెల్లో పేదరికం దూరమవుతుంది.

# కులగణన వర్సెస్ కేబినెట్ బెర్త్: రేవంత్ రెడ్డి ముందు అసలైన సవాల్..!



హైదరాబాద్,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేబినెట్ విస్తరణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో మాదిగ కులానికి చెందిన ఎమ్మెల్యేలు కేబినేట్‌లో తమకు ఈ సారి సరైన ప్రాధాన్యత ఇవ్వవాలని డిమాండ్ చేస్తున్నారు. ఒక వైపు కుల వర్గీకరణలో తెలంగాణ దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందని సీఎం రేవంత్ చెబుతున్నారు. కొత్తగా విస్తరిస్తోన్న కేబినేట్‌లో అన్ని సామాజికవర్గాలకు సమాన న్యాయం ఎలా చేయబోతున్నారనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. తాజాగా మాదిగ సామాజికవర్గం నుంచి వస్తున్న డిమాండ్లు ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాళ్లుగా మారుతున్నాయి. ఇప్పటికే కేబినేట్‌లో బెర్త్ కోసం పలు డిమాండ్లు ఇప్పటికే ముఖ్యంత్రి ముందుకు వచ్చిన నేపథ్యంలో ఇప్పుడు రేవంత్ రెడ్డి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఉత్కంఠ సర్వత్ర నెలకుంది.ప్రస్తుతం తెలంగాణ కేబినేట్‌లో ముఖ్యమంత్రితో సహా 12మంది మంత్రులు ఉన్నారు. సీఎంను కలుపుకొని వీరిలో నలుగురు రెడ్లు, ఇద్దరు షెడ్యూల్ కులాల మంత్రులు, అందులో ఒకరు డిప్యూటీ సీఎం, ఇద్దరు బీసీలకు చెందినవారు, ఒకరు గిరిజనులు(ఎస్టీ), ఒకరు బ్రాహ్మణ, ఒకరు కమ్మ సామాజిక వర్గంతోపాటు మరో బీసీ కోటాలో మంత్రి ఉన్నారు. అయితే ఇప్పుడు మొత్తం 18 మంది వరకు కేబినెట్ విస్తరిం చేందుకు వెసులుబాటు ఉంది. ఈ నేపథ్యంలో ఈ సారి ఎంత మంది కొత్త ఎమ్మెల్యేలకు రేవంత్ రెడ్డి కేబినేట్‌లో అవకాశం కల్పిస్తారనేది ఉత్కంఠగా మారింది.

అసెంబ్లీలో కాంగ్రెస్ సామాజికర్గ సమీకరణలు..

2023 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన 64 మంది ఎమ్మెల్యేలు సామాజికంగా చూసినప్పుడు, కుల ప్రాతినిధ్యంలో స్పష్టమైన అసమతుల్యత కనిపిస్తోంది. తెలంగాణలో రెడ్డి సామాజిక వర్గం మొత్తం రాష్ట్ర జనాభాలో కేవలం 5 శాతం మాత్రమే ఉన్నా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో 30 నుంచి 40 శాతం వరకు రెడ్లు ఉన్నారు. అంటే దాదాపు 19 నుంచి 26 మంది రెడ్డి సామాజిక వర్గానికి చెందినవారే కాంగ్రెస్ ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇది వారి జనాభా శాతం కంటే అధిక ప్రాతినిధ్యాన్ని సూచిస్తుందని పలువురుల అభిప్రాయపడుతున్నారు.మరోవైపు ఎస్సీలు రాష్ట్ర జనాభాలో 17 శాతం మేర ఉన్నా, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల్లో వారి ప్రాతినిధ్యం కేవలం 15%-% 20 శాతం మాత్రమే(అంటే దాదాపు 10%-% 13 మంది మాత్రమే). ఇదే విధంగా బీసీలు రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉండే వర్గం సుమారు 56 శాతం ఉన్నా కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో వారికి 15%-% 25 శాతం మాత్రమే ప్రాతినిధ్యం లభించింది(దాదాపు 10- 16 మంది). రెడ్డి సామాజికవర్గంతో పోల్చుకుంటే ఇది చాలా తక్కువ అనే విమర్శలు వస్తున్నాయి. గిరిజనులు(ఎస్టీలు) రాష్ట్ర జనాభాలో సుమారు 10 శాతం వరకు ఉన్నా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో వారిది కేవలం 6-10 మంది ప్రాతినిధ్యం మాత్రమే. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ నుంచి ఒక్క ముస్లిం ఎమ్మెల్యే కూడా గెలవలేదు. రాష్ట్రంలో ముస్లిం జనాభా సుమారుగా 12-14 శాతం ఉన్నా, వారి ప్రాతినిధ్యం పూర్తిగా శూన్యంగా మిగిలింది. ఈ గణాంకాలన్నీ చూస్తే, కుల పరంగా కాంగ్రెస్ పార్టీ విజయంలో స్పష్టమైన అసమతుల్యత ఉన్నట్లు స్పష్టమవుతుంది. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గానికి అధిక ప్రాతినిధ్యం లభించగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం వర్గాలు తక్కువ ప్రాధాన్యత ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కుల అసమతుల్యత నేపథ్యంలోనే రాబోయే కేబినెట్ విస్తరణలో సామాజిక న్యాయాన్ని పాటించాలని, అన్ని వర్గాలకు గౌరవప్రదమైన ప్రాతినిధ్యం ఇవ్వాలని డిమాండ్లు ఇప్పుడు అన్ని వైపుల నుంచి వస్తున్నాయి.

ఏళ్ల తరబడిన నిర్లక్ష్యం..

ఎస్సీ జనాభాలో 60 శాతం, రాష్ట్ర జనాభాలో దాదాపు 9 శాతం ఉన్న మాదిగలు పాలనా వ్యవస్థలో మినహాయింపుగా మిగిలిపోతున్నారు. 2011 జనగణన ప్రకారం మొత్తం 54.32 లక్షల ఎస్సీ జనాభాలో 32.33 లక్షల మంది మాదిగలు ఉన్నారు. ప్రస్తుతం ఈ సంఖ్య 50 లక్షలుగా అంచనా వేయబడుతోంది. కానీ సంఖ్యల పరంగా ఉన్న బలానికి విరుద్ధంగా, తెలంగాణలో వారి రాజకీయ ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది. రాష్ట్రంలోని మూడు ఎస్సీ రిజర్వ్ లోక్‌సభ స్థానాల్లో ఇద్దరికి మాల కులానికి చెందిన నాయకులే ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే కోటాలో ఎస్సీలకు కేటాయించిన ఏకైక ఎమ్మెల్సీ స్థానం కూడా మాలకే దక్కింది. ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం, స్పీకర్ ఇద్దరూ మాలలకు చెందినవారే. మాదిగలకు కేబినెట్‌లో ఒక్క ప్రాతినిధ్యం ఉన్నా, అది కూడా మొత్తం ఎస్సీలలో కేవలం 1 శాతం ఉన్న మోచే అనే ఉపకులానికి చెందినవారు. దీంతో ఇప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న ఐదుగురు మాదిగ సామాజికవర్గానికి చెందిన ఎమ్మెల్యేలు రాబోయే కేబినెట్ విస్తరణలో తమకు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేస్తున్నారు. తమ ఐదుగురులో ఏ ఒక్కరికి అవకాశం కల్పించిన తమ సామాజికవర్గానికి ప్రాద్యానత లభించినట్లు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

చరిత్రలో మాదిగల పాత్ర, పార్టీ ల హామీలు..

1956 నుంచి 2000 మధ్య కాలంలో అంటే దాదాపు 44 సంవత్సరాల పాటు ఎస్సీ కోటా ఒకే వర్గంగా ఉండింది. ఈ వ్యవధిలో మాదిగలు దాదాపు 18,000 నుండి 20,000 వరకు ప్రభుత్వ ఉద్యోగాలు పొందగలిగారు. అయితే ఇది వారి జనాభా శాతానికి తగిన ప్రాధాన్యత కాదన్న భావన అప్పట్లో నుంచే ఉండేది. 2000 నుంచి 2004 మధ్య కాలంలో అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఎస్సీ కులాల మధ్య ఉపవర్గీకరణను అమలు చేసింది. దీంతో ఎస్సీ కోటాను మాదిగ, మాల ఇతరులుగా విడగొట్టి వారికి విడిగా ఉద్యోగాలు, అవకాశాలను కేటాయించే విధానం అమల్లోకి వచ్చింది. ఫలితంగా కేవలం నాలుగు సంవత్సరాల లోపే మాదిగలకు దాదాపు 23,500 ప్రభుత్వ ఉద్యోగాలు లభించాయి. ఈ నేపథ్యంలో 2023 అసెంబ్లీ ఎన్నికల ప్రచార సమయంలో కాంగ్రెస్ పార్టీ మాదిగల డిమాండ్లను సానుకూలంగా స్వీకరించింది. మాదిగల సామాజిక, ఆర్థిక వెనుకబడిన స్థితిని గుర్తించి కాంగ్రెస్ పార్టీ 'చెవెళ్ల డిక్లరేషన్' అనే పేరుతో ఓ ప్రత్యేక ప్రకటన చేసింది. ఇందులో ఎస్సీ ఉపవర్గీకరణకు మద్దతు ప్రకటించి. అంతేకాక, ఎన్నికల తర్వాత తెలంగాణ శాసనసభలో ఎస్సీ వర్గాల మధ్య ఉన్న ఆర్థిక, సామాజిక అసమానతలను గుర్తించే బిల్లును కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోదించింది. ఇది మాదిగ వర్గానికి చెందిన నేతలు, సంఘాలు ఎంతో కాలంగా కోరుకుంటున్న ప్రాధాన్యమైన అడుగు. ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాలంలో, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సమయంలో మాదిగలకు ఒక్క మంత్రి పదవీ కూడా దక్కలేదు. ఎస్సీ కోటాలో ప్రాధాన్యం మాల వర్గానికే ఎక్కువగా దక్కిందనే విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. దీంతో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగలకిచ్చిన హామీలను అమలు చేయాలని, చారిత్రకంగా జరిగిన ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని డిమాండ్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వస్తున్నాయి. ఈ డిమాండ్లు కేవలం రాజకీయ పదవుల కోసమే కాక, మాదిగ వర్గానికి హక్కుగా భావించిన సామాజిక న్యాయం, ప్రాతినిధ్యం వంటి అంశాలను సాధించడానికని ఆ సామాజికవర్గానికి చెందిన నేతలు అంటున్నారు.

తమ స్వరం వినిపిస్తోన్న ఐదుగురు మాదిగ ఎమ్మెల్యేలు..

తెలంగాణలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎన్నో దశాబ్దాలుగా పార్టీకి విధేయంగా ఉన్న తమ వర్గానికి న్యాయం జరిగేలా కనీసం ఒకరిని అయినా మంత్రివర్గంలో చేర్చాలనీ కాంగ్రెస్ అధిష్టానాన్ని గట్టిగా కోరుతున్నారు. వీరిలో అందరూ కూడా మాదిగ వర్గానికి చెందినవారే కావడం, అలాగే కాంగ్రెస్ ఉద్యమాల్లో పాలు పంచుకున్న కార్యకర్తలుగా గుర్తింపు పొందిన వారు కావడం విశేషం. ఈ ఐదుగురు నేతలు తమలో ఎవరు మంత్రి అయిన తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేస్తున్నారు. ఇది వ్యక్తిగత పదవుల కోరికకోసం కాదు, తమ వర్గానికి న్యాయం చేయాలనే, సరైన ప్రాతినిధ్యం కల్పించాలనే న్యాయపరమైన డిమాండ్ కోసం ఆరాటమని వారు పేర్కొన్నారు. "మాలో ఎవరు కేబినెట్‌కు ఎంపికైనా మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఇది వ్యక్తిగతంగా మంత్రిపదవి కోసం పోరాటం కాదు. ఇది మాదిగ వర్గానికి న్యాయం జరగాలనే ఆశయంతో చేస్తున్న విజ్ఞప్తి. మా వర్గం గతంలో ఎప్పుడూ కాంగ్రెస్‌కు వెన్నుదన్నుగా నిలిచింది. ఈసారి జరిగిన 2023 ఎన్నికల్లో కూడా కీలక నియోజకవర్గాల్లో విజయాన్ని సాధించేందుకు ముఖ్యమైన పాత్ర పోషించింది" అని కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్ అట్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.

కేబినేట్ కోసం వినిపిస్తోన్న పేర్లు..

కేబినేట్ విస్తరణ నేపథ్యంలో ఎవరు మంత్రి పదవి దక్కించుకుంటారనే ఉత్కంఠ రాష్ట్రమంతటా నెలకొంది. సామాజిక సమతుల్యత, రాజకీయ సమీకరణాలు, పార్టీలో సేవల పరిగణతితో కలిపి ఎన్నో అంశాల ఆధారంగా పేర్లు పరిశీలనలో ఉన్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో విశ్వసనీయ వర్గాల నుంచి లభిస్తున్న సమాచారం ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే కొన్ని పేర్లను తన పార్టీ అధిష్టానానికి పంపినట్టు చెబుతున్నారు. వీరిలో సామాజిక విభజనకు అనుగుణంగా వివిధ వర్గాలను ప్రతినిధీకరించేలా ఎంపికలు జరిగే అవకాశముంది. జి వివేక్ ఎస్సీ వర్గానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ ఎంపీ. సొంతంగా భారీ సామాజిక, ఆర్థిక శక్తిని కలిగిన వ్యక్తిగా పేరున్న

# విదేశీ విద్యార్థులకు ట్రంప్ మరో షాక్



వాషింగ్టన్,అమెరికా ప్రభుత్వం విదేశీ విద్యార్థుల విషయంలో కఠిన వైఖరి అవలంబిస్తోంది. ముఖ్యంగా భారతీయ విద్యార్థులతో సహా ఎవరైనా తమ విద్యా సంస్థల్లో తరగతులకు క్రమం తప్పకుండా హాజరుకాకపోయినా, అనుమతి లేకుండా విద్యా కార్యక్రమాల నుంచి వైదొలగినా వారి స్టూడెంట్ వీసాలను రద్దు చేయనున్నట్లు అమెరికా రాయబార కార్యాలయం (యూఎస్ ఎంబసీ) తేల్చి చెప్పింది. ఈ నిబంధనల ఉల్లంఘన భవిష్యత్తులో ఎలాంటి అమెరికా వీసా పొందే అర్హతపైనా తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. ఈ పరిణామాలు డొనాల్డ్ ట్రంప్ పరిపాలనా కాలం నుంచి విదేశీ విద్యార్థులపై పెరుగుతున్న నిఘా , కఠిన వైఖరికి అద్దం పడుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

విస్తరిస్తున్న ఆంక్షల వలయం:

కేవలం విద్యా సంబంధిత విషయాలకే పరిమితం కాకుండా, ఇతర కార్యకలాపాలపై కూడా అమెరికా దృష్టి సారించింది. ఇటీవల పాలస్తీనాకు మద్దతుగా జరిగిన ఆందోళనలలో పాల్గొన్న విద్యార్థుల వీసాలు, అలాగే ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, అతివేగంతో వాహనం నడపడం, మద్యం సేవించి వాహనం నడిపిన కేసులలో కూడా వీసాలు రద్దు చేయబడ్డాయి. ఈ కఠిన చర్యల నేపథ్యంలో కొందరు భారతీయ విద్యార్థులు న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. ఉదాహరణకు వీసాలు రద్దయిన 133 మంది విద్యార్థులు న్యాయస్థానంలో పోరాడి ఊరట పొందగలిగారు.

భారతీయ విద్యార్థులపై ప్రభావం:

అమెరికా అనుసరిస్తున్న ఈ కఠిన విధానాలు, ముఖ్యంగా భారతీయ విద్యార్థులకు అమెరికాలో విద్యావకాశాలను మరింత సంక్లిష్టంగా మారుస్తున్నాయి. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ వీసాలపై ఉన్న విద్యార్థులు తమ ఉపాధి స్థితిని 90 రోజుల్లోగా తప్పనిసరిగా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కు నివేదించాలని, లేనియెడల వారు తమ చట్టబద్ధమైన హోదాను కోల్పోతారని హెచ్చరికలు జారీ అయ్యాయి. చిన్నపాటి పొరపాట్లు కూడా తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుండటంతో విద్యార్థుల్లో ఆందోళన, గందరగోళం నెలకొన్నాయి.

గణాంకాలు, మారుతున్న ధోరణులు:

భారత విదేశాంగ శాఖ గణాంకాల ప్రకారం.. 2025 నాటికి సుమారు 18 లక్షల మంది భారతీయ విద్యార్థులు విదేశాల్లో విద్యనభ్యసిస్తున్నారని అంచనా. వీరిలో అమెరికాలో 3,31,602 మంది, కెనడాలో 1,37,608 మంది, యూకేలో 98,890 మంది ఉన్నారు. అయితే గమనించాల్సిన విషయం ఏమిటంటే, అమెరికాలో భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పడుతుండగా, కెనడా , యూకేలలో ఈ సంఖ్య పెరుగుతోంది. అమెరికా అనుసరిస్తున్న కఠిన వీసా విధానాలే ఈ మార్పునకు కారణమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

విద్యార్థులకు సూచనలు:

అమెరికాలో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నిపుణులు సూచిస్తున్నారు. అమెరికా వీసా నిబంధనలను క్షుణ్ణంగా అర్థం చేసుకోవాలి. తమ విద్యా సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, వారి మార్గదర్శకాలను పాటించాలి. తరగతులకు క్రమం తప్పకుండా హాజరు కావాలి మరియు OPT నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి. వీసా సంబంధిత సమస్యలు ఎదురైతే తక్షణమే అనుభవజ్ఞులైన న్యాయ నిపుణుల సలహా తీసుకోవడం చాలా ముఖ్యం.ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా విద్యార్థులు అమెరికాలో తమ విద్యా లక్ష్యాలను విజయవంతంగా చేరుకోవడానికి అవకాశం ఉంటుంది.

# సీఎంను కలవడానికి వెళితే అరెస్టులా

బచ్చన్నపేట, ప్రజాపాలన అంటే ఊరికి సేవ చేసిన మాజీ సర్పంచ్‌లను అరెస్టులు చేయడమేనా అని జనగామ జిల్లా మాజీ సర్పంచ్‌ల ఫోరం బచ్చన్నపేట మండల అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి అన్నారు. పెండింగ్ బిల్లులు విడుదల చేశామని ప్రభుత్వం పేపర్ ప్రకటనకే తప్ప ఇప్పటివరకు గ్రామపంచాయతీలకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి వినతిపత్రం ఇవ్వాలని హైదరాబాద్‌కు వచ్చే సర్పంచులను ఎక్కడికి అక్కడ అడ్డుకోవడం, అక్రమంగా నిర్బంధించడం అప్రజాస్వామికమన్నారు. అప్పులు తెచ్చి, ఆస్తులు అమ్మి, భార్యా పిల్లల మీద ఉన్న బంగారం కుదువ పెట్టి గ్రామ అభివృద్ధి కోసం చేసిన డబ్బులు ఇవ్వాలంటే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని మండిపడ్డారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తూ, చిన్న పనులు చేసిన మాజీ సర్పంచ్‌లకు మాత్రం బిల్లులు చెల్లించకపోవడంలో ఆంతర్యం ఏమిటని నిలదీశారు. అరెస్ట్ అయినవారిలో వడ్డేపల్లి మల్లారెడ్డి, కోనేటి స్వామి, ముసిని సునీత రాజు గౌడ్, ఎండీ కలిలా బేగం ఆజాం, తాతిరెడ్డి భవాని శశిధర్ రెడ్డి, పర్వతం మధు ప్రసాద్ తదితరులున్నారు.

# ఏడాదిలో ఇచ్చిన హామీలు ఎన్ని అమలు చేశారు

తిరుపతి,కూటమి ప్రభుత్వం పెడుతున్న అక్రమ కేసులకు భయపడే వాళ్లు ఇక్కడ ఎవరూ లేరని మాజీ మంత్రి, వైసీపీ నేత ఆర్కే రోజా అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే కాకాణి గోవర్ధన్ రెడ్డిని అరెస్టు చేశారన్నారు. రోజుకొకరిపై అక్రమ కేసులు పెట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పెట్టుకుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు చేసిన పనులకు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయ్యాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి.. అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా ఉంటుందో చూపిస్తామని రోజా చెప్పుకొచ్చారు. తిరుపతిలో మాజీ మంత్రి ఆర్కే రోజా మీడియాతో మాట్లాడుతూ...ఏడాదిలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశామని మహానాడులో తీర్మానం చేసే దమ్ము టీడీపీకి నేతలకు ఉందా?. ఏ హామీలు అమలు చేశారని మహానాడు నిర్వహిస్తున్నారో టీ-డీపీ నేతలు సమాధానం చెప్పాలి. పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి, కాకాణిపై కేసులు అక్రమంగా పెట్టారు. అక్రమ కేసులకు భయపడే వారు ఇక్కడ ఎవరూ లేరు. రాబోయే రోజుల్లో కూటమి నేతలు చేసిన పనులకు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఉంటు-ంది. జగన్ మళ్లీ సీఎం అయ్యాక రెడ్ బుక్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి అంబేద్కర్ రాజ్యాంగాన్ని ఎలా ఉంటు-ందో చూపిస్తాం. లిక్కర్ స్కామ్ అనేది ఒక పెద్ద అబద్ధం. స్కామ్ జరగలేదు, టీ-డీపీ మాత్రం స్కామ్ జరిగిందంటూ కేసులు పెట్టి వేధిస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక లిక్కర్, ఇతర స్కామ్ అంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు' అని మండిపడ్డారు.

# సమరానికి సర్కార్ రెఢీ?

హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు స్థానిక సంస్థల ఎన్నికలలు నిర్వహించాలన్న నిర్ణయానికి వచ్చింది. పంచాయతీ పాలక వర్గాల గడువు ముగిసి ఏడాది పైనే అయినా, ప్రభుత్వం ఎన్నికల ఉసెత్తక పోవడంతో ఇటు పార్టీ నాయకులో, అటు గ్రామీణ ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యకతమవుతోంది. ఈ నేపథ్యంలో ఇంకా ఆలస్యమైతే పార్టీకి, ప్రభుత్వానికి కూడా మరింత నష్టం జరిగే ప్రమాదం ఉందనే సంకేతాలు అందడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక ఎన్నికలు నిర్వహించాలనే నిర్ణయానికి వచ్చినట్లు అధికార వర్గాల సమాచారం. నిజానికి, జూన్ జూలై నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయిం చింది. అయితే.. గ్యారెంటీలు, హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యం ఎన్నికలపై ప్రభావం చూపు తుందని సొంత సర్వేలు తేల్చిచెప్పడంతో ముఖ్యమంత్రి ఎన్నికల నిర్వహణ విషయంలో తటపటాయిస్తూ వచ్చారని అంటున్నారు. అయితే.. అదే సమయంలో ఆలస్యం అమృతం విషం అన్నట్లుగా, ఆలస్యం అయిన కొద్దీ పరిస్థితి మరింతగా విషమించే ప్రమాదం ఉందనే సంకేతాలు రావడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఎన్నికల నిర్వహించాలానే నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది.జూన్ 2.. తెలంగాణ అవతరణ దినోత్సవం రోజున స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల గంట కొడతారని అంటున్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జరిగే వేడుకల్లో.. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో పంచాయతీ ఎన్నికల ప్రస్తావన చేస్తారని అంటున్నారు. ఆ తర్వాత జూన్ 5లోగా స్టేట్ ఎలక్షన్ కమిషన్ (ఎస్ఈసీ) నుంచి ప్రకటన రావచ్చని అధికార వర్గాల సమాచారం. రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్,ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా.. ముఖ్యమంత్రి స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల ప్రస్తావన తెచ్చినట్లు చెపుతున్నారు. పంచాయతీ ఎన్నికలు జరపాలని ఎమ్మెల్యేల నుంచి ఒత్తిడి వస్తున్నదని ముఖ్యమంతి అధికారులకు తెలుపగా, ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నామని అధికారులు చెప్పినట్టు సమా చారం. అంతే కాకుండా ముఖ్యమత్రి సమీక్ష సమావేశం అనంతరం తొలిసారిగా కమిషనర్ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఇతర ముఖ్య అధికారులతో మాట్లాడినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఏ సమయంలోనైనా ఎన్నికల నోటిఫికేషన్ వెలువడవచ్చని, సిద్ధంగా ఉండాలని అధికారులను కమిషనర్ ఆదేశించినట్టు ఆ వర్గాలు తెలిపాయి. సో.. త్వరలోనే రాష్ట్రంలో ఎన్నికల నగారా మోగనుంది. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ విజయం తరువాత జరుగుతున్న తొలి ఎన్నికలు. అంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలి ఎన్నికల పరీక్షకు వెళుతున్నారన్న మాట. సహజంగా స్థానిక సంస్థల ఎనికల్లో అధికార పార్టీకి అడ్వాంటేజ్ ఉంటుందని అంటారు.అయితే.. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక పరిస్థితులు అందుకుభిన్నంగా కనిపి స్తున్నాయని అంటున్నారు. ముఖ్యంగా.. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హమీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయిందనే అభిప్రాయం బలంగా జనంలోకి వెళ్లిందని అంటున్నారు. ఇటీవల జరిగిన పట్ట భద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ వ్యతిరేకత స్పష్టంగా వ్యక్తమైందని, అంటున్నారు. నిజానికి.. ప్రజల్లో వ్యక్తమవుతున్న వ్యతిరేకతను తట్టుకోలేకనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఫలితాలతో సంబం ధం లేకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం పై వత్తిడి తెస్తున్నారని అంటు న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పంచాయతీరాజ్ అధికారులతో జరిపిన సమీక్ష సమావేశంలోనూ ఎమ్మెల్యేల వత్తిడి అంశాన్ని ప్రస్తావించారని ఈ సందర్భంగా గుర్తు చేస్తున్నారు. కాగా.. పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే ప్రజలు తమ సమస్యలను స్థానిక ప్రజా ప్రతినిధులకు చెప్తారని, తమపై కాస్త ఒత్తిడి తగ్గుతుందని ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. అందుకే వెంటనే ఎన్నికలకు వెళ్లాలని కొందరు ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులకు మొరపెట్టుకున్నట్లు తెలిసింది. సన్నబియ్యం, రేషన్‌కార్డుల పంపిణీ, యువవికాసం వంటి పథకాల అమలు అంశం కలిసి వస్తుందని కూడా కాంగ్రెస్ నేతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

